సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం, 7, సెప్టెంబర్, 2023



ముకుందా.. మురారీ..

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం అవతరించిన శ్రీ కృష్ణుడి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. 8లో



రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతి

ఏన్కూరు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సుజాతనగర్ మండలానికి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. 8లో



వాతావరణం

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వీనులవిందుగా శ్రీమద్భాగవత పారాయణం

నేడు రామాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



భాగవత సప్తాహంలో హోమం చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శ్రీమద్భాగవత పారాయణం వీనుల విందుగా సాగుతోంది. బుధవారం సప్తాహ హవనంలో భాగంగా చిత్రకూట మండపంలో గోపూజ, చతుఃస్థానార్చన, దశమస్కంధ హోమం నిర్వహించారు. అలాగే 3వ స్కంధంలోని 21వ అధ్యాయం నుంచి 5వ స్కంధంలోని 23వ అధ్యాయం వరకు పారాయణం చేశారు. ఈనెల 11 వరకు పారాయణ హవనం ఉంటుందని అర్చకులు తెలిపారు. కాగా, గురువారం శ్రీ కృష్ణాష్టమి వేడుకల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఊంజల్ సేవ, శుక్రవారం ఉట్ల పండుగ జరపనున్నారు.

రామయ్య ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం

బుధవారం సందర్భంగా స్వామి వారి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రామాలయ ముఖ్య అర్చకుడి రాజీనామా

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ముఖ్య అర్చకుడిగా పనిచేస్తున్న శ్రవణ్‌కుమారాచార్యులు తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. గత కొద్ది నెలలుగా దీర్ఘకాలిక సెలవులో ఉన్న ఆయన గడువు ముగిసినా విధుల్లో చేరలేదు. దీనిపై ఆలయ అధికారులు వివరణ కోరగా.. ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లుగా మెయిల్ పంపగా ఈఓ రమాదేవి రాజీనామాను ఆమోదించినట్లు తెలుస్తోంది. దీనిని ఆలయ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది.

షెడ్యూల్ ప్రకారం బదిలీల ప్రక్రియ చేపట్టాలి

డీఈఓ వెంకటేశ్వరాచారి



బాధ్యతలు స్వీకరించిన డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ షెడ్యూల్ ప్రకారం జరిగేలా ఎంఈఓలు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి అన్నారు. బుధవారం ఆయన ఎంఈఓలతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ జరుగుతున్నందున దరఖాస్తు చేసుకున్న వారి డాక్యుమెంట్లను ఎంఈఓలు పారదర్శకంగా పరిశీలించాలని సూచించారు. ఆ తర్వాత సంతకం చేసి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ముఖ్యంగా సివిల్ లిస్ట్, ఐదు సంవత్సరాలు నిండిన ప్రధానోపాధ్యాయుల జాబితా, ఎనిమిదేళ్లు పూర్తయిన వారితో పాటు క్లియర్ వేకెన్సీల జాబితా, మూడేళ్లలో రిటైర్డ్ అయ్యేవారి జాబితాలతో గురువారం డీఈఓ కార్యాలయానికి రావాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు ఏ.నాగరాజశేఖర్, ఎస్‌కె.సైదులు, ఎన్.సతీష్‌కుమార్ పాల్గొన్నారు. కాగా, డీఈఓగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరాచారి కలెక్టర్ ప్రియాంక అలను మర్యాదపూర్వకంగా కలిశారు.

భద్రాద్రికి బండి



రామయ్య భక్తులకు రైల్వే శాఖ తీపి కబురు

- భద్రాచలం – మల్కన్‌గిరిపై కీలక నిర్ణయం
- ఫైనల్ లోకేషన్ సర్వేకు ఆదేశించిన అధికారులు
- నివేదిక వస్తే బడ్జెట్ కేటాయింపులే
- రాబోయే రెండేళ్లలో పనులు ప్రారంభం?

సింగరేణి టు యాదాద్రి

నల్గొండ జిల్లాలో 4000 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు సింగరేణి బొగ్గును మరింత వేగంగా వ్యాగన్ల ద్వారా సరఫరా చేసే లక్ష్యంతో డోర్నకల్ – మిర్యాలగూడ రైల్వే లైన్‌కు రైల్వే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మార్గానికి కూడా ఫైనల్ లొకేషన్ సర్వేను మంజూరు చేసింది. ఈ లైన్ అందుబాటులోకి వస్తే బొగ్గు రవాణాలో డోర్నకల్ – భద్రాచలంరోడ్ బ్రాంచ్‌లైన్ మరింత కీలకంగా మారుతుంది.

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి రామయ్య భక్తులకు రైల్వేశాఖ తీపి కబురు చెప్పింది. రామయ్య చెంతకు రైలు సౌకర్యం కల్పించే భద్రాచలం – మల్కన్‌గిరి (ఒడిశా) మార్గం నిర్మాణంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రైలుమార్గం నిర్మాణానికి ఫైనల్ లోకేషన్ సర్వేను మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రాథమిక సర్వేకు ఏడాది

దట్టమైన ఏజెన్సీ ప్రాంతాలైన తెలంగాణలోని భద్రాచలం (పాండురంగాపురం రైల్వేస్టేషన్) నుంచి ఒడిశాలోని మల్కన్‌గిరిని కలుపుతూ కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి రైల్వేశాఖ 2021లో పచ్చజెండా ఊపింది. ఈ రెండు పట్టణాల మధ్య 173 కిలోమీటర్ల మేర లైన్ నిర్మించేందుకు ప్రాథమిక సర్వే చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.3 కోట్లు కేటాయించింది. ఏడాది పాటు జరిగిన ప్రాథమిక సర్వే రిపోర్ట్ 2022 జూన్‌లో వచ్చింది. ఇందులో ఒడిశాలోని మల్కన్‌గిరిలో బయలుదేరితే.. బదాలి, కోవాసిగూడ, రాజన్‌గూడ, మహరాజ్‌పల్లి స్టేషన్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో కన్నాపురం, కూటుగుట్ట, పల్లు, నందిగామ స్టేషన్లు ఉన్నాయి. తెలంగాణ పరిధిలో భద్రాచలం, పాండురంగాపురంలో స్టేషన్లు నిర్మించాలని సర్వేలో పేర్కొన్నారు. ఈ రైలు మార్గం దారిలో గోదావరి, శబరితో పాటు చిన్నా పెద్దా కలిపి 213 వంతెనలు నిర్మించాల్సి వస్తుందని తేల్చారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.3,592 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ లైన్‌కు సంబంధించి ప్రాథమిక రిపోర్టు వచ్చి ఏడాది దాటింది. అప్పటి నుంచి ఈ రైల్వేలైన్ నిర్మాణంపై ఉలుకూపలుకు లేదు. దీంతో భద్రాచలంరోడ్ – కొవ్వూరు, కొత్తగూడెం – కొండపల్లి, మణుగూరు – రామగుండం రైల్వేలైన్ల తరహాలో ఇది కూడా సర్వేలకే పరిమితం అవుతుందనే భావన జిల్లా వాసుల్లో ఏర్పడింది.

ఫైనల్ లొకేషన్ సర్వే..

దేశవ్యాప్తంగా ప్రాథమిక సర్వే రిపోర్టులను పరిశీలించిన రైల్వేశాఖ అందులో ప్రాధాన్యత క్రమాన్ని అనుసరించి ఏ ప్రాజెక్టును నిర్మించాలనే నిర్ణయం తీసుకుంటుంది. ఒకసారి ఫలానా రైల్వే లైన్ నిర్మించాలని నిర్ణయం తీసుకున్న తర్వాత బడ్జెట్ కేటాయింపునకు ముందు ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్) చేపడుతుంది. ఈ సర్వేలో మరింత స్పష్టంగా వివరాలు సేకరిస్తుంది. అందులో రైలుమార్గం వెళ్లే దారిలో వర్షాల ప్రభావం, వరద, కాంటూరు లెవల్స్, వంతెనలు, కల్వర్టుల నిర్మాణానికి ఎలాంటి డిజైన్ ఉపయోగించాలి, నిర్మాణ ప్రదేశాలకు మ్యాన్ పవర్‌ను ఎలా పంపాలి, వారికి ఎక్కడ బస ఏర్పాటు చేయాలి, నిర్మాణ సామగ్రిని చేరవేయడం ఎలా అనే ప్రతీ అంశంలో క్షుణ్ణంగా వివరాలు సేకరించి రిపోర్ట్ తయారు చేస్తారు. దీని ఆధారంగా మొత్తం పనిని పలు బిట్లుగా విభజించి నిధులు మంజూరు చేస్తారు.

రెండేళ్లలో పనులు

రైల్వే లైన్ నిర్మించే మార్గంలో ఉండే భౌగోళిక అననుకూలతలను బట్టి ఫైనల్ లొకేషన్ సర్వేకు ఎంత సమయం పడుతుందనేది ఆధారపడి ఉంటుంది. సాధారణంగా ఏడాదిలోగానే రైల్వేశాఖ ఫైనల్ సర్వేను పూర్తి చేస్తుంది. ఆ తర్వాత ఫైల్ రైల్వే బోర్డుకు చేరుతుంది. అక్కడ ఆర్థిక పరమైన మదింపు తర్వాత నిధులు కేటాయిస్తారు. ప్రస్తుత రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఒడిశాకు చెందిన వారు కావడంతో మల్కన్‌గిరి – భద్రాచలం రైల్వే లైన్ నిర్మాణ పనుల్లో పురోగతి వేగంగా సాగుతోంది. ఇదే స్పీడ్ కొనసాగితే మరో రెండేళ్లలో ఈ రైలుమార్గం నిర్మాణ పనులు మొదలయ్యే అవకాశం ఉంది. అలా జరిగితే భద్రాచలం నుంచి దేశంలోని ప్రముఖ పుణ్య క్షేత్రాలకు కొత్త రైళ్లను ప్రారంభించే అవకాశం కలుగుతుంది. ఫలితంగా జిల్లా వాసులకు రైలు ప్రయాణ సౌకర్యం మరింత విస్తృతం కానుంది.

కొత్తగూడెం - కిరోండల్ లైన్‌కు..

కొత్తగూడెం నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని ఐరన్ ఓర్ గనులకు కేంద్రమైన కిరోండల్ వరకు కొత్త రైలు మార్గం నిర్మాణానికి ఫైనల్ లొకేషన్ సర్వేకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. కొత్తగూడెం – కిరోండల్ మధ్య దూరం కేవలం 180 కిలోమీటర్లుగా ఉంది. ప్రస్తుతం కిరోండల్‌కు విశాఖపట్నం నుంచి మాత్రమే రైలుమార్గం అందుబాటులో ఉంది. ఈ మార్గం నిడివి 440 కి.మీ. దీంతో దగ్గరి దారిగా కొత్తగూడెం నుంచి కిరండోల్‌కు రైలుమార్గాన్ని నిర్మిస్తామంటూ 2014 – 15 సంవత్సర బడ్జెట్‌లో రైల్వేశాఖ ప్రకటించింది. సర్వే కోసం కేవలం రూ.10 లక్షలు మంజూరు చేసి చేతులు దులుపుకుంది. ఆ తర్వాత ప్రాథమిక సర్వేను 2018 బడ్జెట్‌లో మంజూరు చేసింది. తాజాగా ఫైనల్ సర్వే రిపోర్టుకు ఆదేశాలు జారీ చేసింది. భద్రాలచం – మల్కన్‌గిరి రైల్వేలైన్ తెలంగాణ – ఆంధ్రా మీదుగా ఒడిశాకు వెళ్తుండగా కొత్తగూడెం – కిరోండల్ మార్గం తెలంగాణ మీదుగా నేరుగా ఛత్తీస్‌గఢ్ వెళ్లేలా నిర్మించే అవకాశం ఉంది.

విద్య, వైద్యం పట్టదా?

- ఈ రెండు రంగాల్లో ఒకప్పుడు రారాజుగా సింగరేణి
- ప్రస్తుతం తీసికట్టుగా మారిన పరిస్థితి
- ఇప్పుడు సరిగా దృష్టి పెట్టని సంస్థ
- భవనాల నిర్మాణాలకే అధికారుల మొగ్గు



సింగరేణి ప్రధాన కార్యాలయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నూతన భవనాలు, అధికారులకు బంగ్లాలు, కార్మికులకు క్వార్టర్లు నిర్మించడంలో ఉన్న శ్రద్ధ విద్య, వైద్య రంగాల్లోనూ పెట్టాలని సింగరేణి కార్మికులు కోరుతున్నారు. ఈ రెండు విషయాల్లో సంస్థ పరంగా చెప్పుకోదగిన మార్పులు లేక చాలా ఏళ్లు అవుతోంది. దీంతో వైద్య సేవల కోసం కార్మికులు, ఉద్యోగులు తరచూ హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోంది. ఇక సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ నామ్‌కే వాస్తే అన్నట్టుగా మారింది.

జాడలేని సీబీఎస్ఈ

సింగరేణి విస్తరించిన నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రైవేటు పాఠశాలల హవా 90వ దశకంలో నడిచింది. ఈ రోజుల్లో ఉన్న తీవ్రమైన పోటీలోనూ సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ పరిధిలోని పాఠశాలలు అత్యుత్తమ ఫలితాలు సాధించాయి. సింగరేణి స్కూళ్లలో సీటు దొరకడమే కష్టంగా ఉండేది. కానీ గత పదిహేనేళ్లలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వీర్యమై పోయిందనే భావన కలుగుతోంది. మెరుగైన ఫలితాలు లేక అడ్మిషన్లు తగ్గిపోయాయి. ఫలితంగా ఒక్కో పాఠశాల మూతపడుతూ వస్తోంది. ఒకప్పుడు 13 వరకు ఉన్న స్కూళ్లు ఇప్పుడు తొమ్మిదికి పడిపోయాయి. విద్యార్థుల సంఖ్య సగానికి సగం తగ్గింది. ఒకప్పుడు కార్మికుల పిల్లలకే అడ్మిషన్లు దొరకని స్థితి నుంచి నేడు అందరికీ ప్రవేశాలు కల్పించినా సీట్లు మిగిలిపోయే దశకు చేరుకుంది. మారుతున్న పరిస్థితులకు తగ్గట్టు సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెడతామని చెప్పినా.. అది ఆచరణకు నోచుకోవడం లేదు.

'ప్రొఫెషనలిజం' ఏదీ

సింగరేణి సహకారంతో 40 ఏళ్ల క్రితం కొత్తగూడెంలో స్థాపించిన మైనింగ్ కాలేజీ, ఆ తర్వాత ఐటీఐ కాలేజీ, కమ్యూనిటీ పాలిటెక్నిక్, నర్సింగ్ కాలేజీలు మినహా ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి ప్రగతిశీల మార్పులేమీ చోటుచేసుకోలేదు. రామగుండం మెడికల్ కాలేజీకి రూ.500 కోట్లు నిధులు సమకూర్చి కాలేజీ పేరును సింగరేణి వైద్య కళాశాల అని మార్చడం, 5 శాతం రిజర్వేషన్లు తప్ప ఒనగూరిన భారీ ప్రయోజనం ఏమీ లేదు. కాకతీయ వర్సిటీ పరిధిలోకి వెళ్లిన మైనింగ్ కాలేజీలో సమస్యలు తిష్ట వేశాయి. మరోవైపు ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలు శిథిలమైన భవనాల్లో కునారిల్లుతున్నాయి. ఇవి ప్రభుత్వ పరిధిలో ఉన్నాయనే సాకుతో సింగరేణి ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. కానీ ఇక్కడ చదువు పూర్తి చేసుకున్న విద్యార్థుల తదుపరి గమ్యం సింగరేణి అన్న విషయాన్ని సంస్థ పరిగణనలోకి తీసుకోవడం లేదు.

ఇక్కడైతే ఓకే

విద్య, వైద్య రంగాల్లో సంస్కరణలు, అభివృద్ధికి ఎంతో ఆస్కారం ఉన్నా ఆ విషయాన్ని పక్కన పెట్టి భవనాల నిర్మాణంపై సింగరేణి అధికారులు మక్కువ చూపిస్తున్నారు. 12వేలకు పైగా క్వార్టర్లు ఖాళీగా ఉన్నా వాటిని పక్కన పెట్టి కొత్తగా రూ.273 కోట్లతో 643 క్వార్టర్లు నిర్మించడం విమర్శలకు తావిస్తోంది. ఇందులోనూ బంగ్లోస్ పేరిట అధికారుల కోసం భారీ గెస్ట్‌హౌస్/ క్వార్టర్ల నిర్మాణం చూసి కార్మికులు ముక్కున వేలేసుకుంటున్నారు. గతంలోనూ భవన నిర్మాణల విషయంలో ఇదే ఉత్సాహం చూపించి విమర్శలపాలయ్యారు. అప్పటి ఆదిలాబాద్ జిల్లా చెన్నూరులో బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కాకముందే వందల సంఖ్యలో క్వార్టర్లు నిర్మించారు. చివరకు అక్కడ బొగ్గు తవ్వలేదు. దీంతో తొందరపడి నిర్మించిన క్వార్టర్లు నిరుపయోగంగా మారిపోయాయి.

ప్రాభవం కోల్పోయిన ప్రధానాస్పత్రి..

సింగరేణి విస్తరించిన ఆరు జిల్లాల పరిధిలో 42 వేల మంది కార్మికులు, ఉద్యోగులు ఉన్నారు. వీరి కుటుంబ సభ్యులు, రిటైర్డ్ కార్మికులకు వైద్య సేవలు అందించేందుకు 21 డిస్పెన్సరీలు, ఏడు ఆస్పత్రులు, నాలుగు రీజనల్ ఆస్పత్రులను సంస్థ నిర్వహిస్తోంది. వీటికి తోడు కొత్తగూడెంలో ప్రధానాస్పత్రి ఉంది. రెండు దశాబ్దాల క్రితం వరకు ఉత్తర తెలంగాణలో వరంగల్ ఎంజీఎం తర్వాత ఆ స్థాయిలో వైద్య సేవలు అందించే ఆస్పత్రిగా దీనికి పేరుండేది. కానీ గత కొన్నేళ్లుగా ఆ ప్రాభవాన్ని కోల్పోయింది. పరిస్థితులకు తగ్గట్టుగా ఆస్పత్రిలో మార్పులు రాకపోవడం, కొత్త తరహా వైద్య సేవలు, స్పెషలిస్టులు లేకపోవడం లోటుగా మారింది. తాతల కాలం నాటి ఎక్స్‌రేలు, రక్త పరీక్షలే ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఇటీవలే సీటీస్కాన్, ఎంఆర్ఐ స్కాన్ లాంటి సేవల కోసం ప్రయత్నాలు మొదలెట్టారు. కొత్తగూడెం ఆస్పత్రికి దీటుగా చెప్పుకునే గోదావరిఖని ఆస్పత్రిదీ ఇంచుమించు ఇదే పరిస్థితి. ఇక భూపాలపల్లి, శ్రీరాంపూర్, బెల్లంపల్లిలో ఉన్న రీజియన్ ఆస్పత్రుల్లో వైద్య సేవల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిదన్నట్టుగా ఉంది. సాధారణ వైద్య సేవలు మినహా అత్యవసర, స్పెషాలిటీ సేవలు అవసరమైతే హైదరాబాద్‌కు రిఫర్ చేయడం సింగరేణిలో పరిపాటిగా మారింది. పైగా 162 ప్రైవేటు ఆస్పత్రులతో టై అప్ అయ్యామంటూ సంస్థ అధికారులు ఘనంగా చెప్పుకుంటున్నారు.

'నీతి ఆయోగ్ బ్లాక్'గా గుండాల



మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

కలెక్టర్ ప్రియాంక అల వెల్లడి

సూపర్‌బజార్(కొత్తగూడెం): గుండాల మండలాన్ని నీతి ఆయోగ్ యాస్పిరేషనల్ బ్లాక్‌గా ఎంపిక చేసినట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. ఢిల్లీ నుంచి నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యం బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. యాస్పిరేషన్ బ్లాక్‌గా ఎంపిక చేసినందున గుండాల మండల అభివృద్ధికి సంబంధిత శాఖల అధికారులు పారామీటర్ల ఇండికేటర్లను తయారు చేయాలని చెప్పారు. మండల అభివృద్ధి కోసం నీతిఆయోగ్ నేరుగా ప్రధానమంత్రి ఆర్థిక సంఘం నిధులను తమకు పంపుతారని అన్నారు. అధికారులు శాఖల వారీగా చేపట్టాల్సిన 39 అంశాల పారామీటర్లపై మూడు రోజుల్లో నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గుండాల మండలంలోని 11 గ్రామపంచాయతీలకు ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తెచ్చేలా కార్యాచరణ నివేదికలు సిద్ధం చేయాలన్నారు. యాస్పిరేషన్ అంశాలపై వచ్చే వారం సమీక్ష సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. వివిధ శాఖల అధికారులకు కేటాయించిన విధంగా పారామీటర్లు ప్రతినెల 7వ తేదీ వరకు పరిశీలన చేసి జిల్లా అధికారులు అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో సీపీఓ శ్రీనివాసరావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, జిల్లా పంచాయతీ అధికారి రమాకాంత్, మహిళా, శిశు సంక్షేమాధికారి లెనినా, వ్యవసాయ శాఖ ఏడీఏ లాల్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా, శిశు సంక్షేమ అధికారిగా అదనపు బాధ్యతలు



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న విజేత

సాక్షి ఎఫెక్ట్..

సూపర్‌బజార్(కొత్తగూడెం)/ కొత్తగూడెంటౌన్: జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి విజేతకు మహిళా, శిశు సంక్షేమాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక విజేతకు బుధవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కలెక్టర్ మార్గదర్శకాల మేరకు విధులు నిర్వహించి శాఖకు మంచిపేరు తీసుకొస్తానని విజేత అన్నారు. కాగా, ఐసీడీఎస్ చైల్డ్ వెల్ఫేర్ విభాగంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన నియామకాలు చేపట్టేందుకు ఇచ్చిన నోటిఫికేషన్ చర్చనీయాంశంగా మారింది. ఈ విషయాలను ప్రస్తావిస్తూ సాక్షిలో ఈనెల 4న 'ఐసీడీఎస్ లిస్ట్‌లో అనర్హులు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇప్పటికే జిల్లా సంక్షేమశాఖ అధికారిణి వరలక్ష్మి, ఎం.సబితను వివిధ ఆరోపణల నేపథ్యంలో ఆ శాఖకు సరెండర్ చేశారు. ఇక సాక్షి కథనానికి స్పందించిన కలెక్టర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలపై విచారణ చేసి సీడీపీఓ స్వర్ణలత లెనినాను సైతం తప్పించి ఉపాధి కల్పన అధికారి విజేతకు అదనపు భాధ్యతలు అప్పగించారు.

ఉద్యోగాలతో గిరిజన యువతకు స్థిర జీవనం

జాబ్‌మేళాలో ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



గిరిజన యువతితో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: గిరిజన నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడం ద్వారా వారి జీవితం సుస్థిరమవుతుందని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులతో ముఖాముఖి మాట్లాడి వారి అర్హతలు, అనుభవం తెలుసుకుని ఉద్యోగాల ఎంపికకు సూచనలు చేశారు. అనంతరం పీఓ మాట్లాడుతూ.. చదువుకున్న గిరిజన యువతకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు కల్పించడానికి జాబ్‌మేళా ఏర్పాటు చేశామని తెలిపారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఉద్యోగంలో చేరితే అనుభవం వస్తుందని.. ఆ తర్వాత అర్హతల ఆధారంగా మెరుగైన స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. కాగా, వైటీసీ ఆధ్వర్యాన గిరిజన యువతకు వివిధ ఉపాధి అంశాల్లో శిక్షణ ఇవ్వడమే కాక సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొందరు యువతీ, యువకులు టెట్, డీఎస్సీ కోచింగ్ శిక్షణ ఇప్పించాలని కోరగా పరిశీలిస్తామని పీఓ బదులిచ్చారు. అనంతరం వివిధ ప్రైవేట్ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 303 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఐటీడీఏ అధికారులు, వివిధ ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయాలి

బూర్గంపాడు: ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం బూర్గంపాడు తహసీల్ కార్యాలయంలో రాజకీయపార్టీల నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 19 వరకు కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులు పూర్తిచేయాలన్నారు. అన్ని పోలింగ్ బూత్‌లలో వసతులను కల్పించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ రాజారావు, ఎంపీడీఓ వివేక్‌రామ్, ఎంపీఓ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసాని గలగల..



కిన్నెరసాని నుంచి విడుదలవుతున్న నీరు

పాల్వంచరూరల్ : ఎగువన కురుస్తున్న వర్షాలకు కిన్నెరసాని జలాశయానికి వరదనీరు వచ్చి చేరుతోంది. 407 అడుగుల సామర్థ్యం గల రిజర్వాయర్ నీటిమట్టం బుధవారం 405.40 అడుగులకు చేరడంతో రెండు గేట్లు ఎత్తి 6వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు కేటీపీఎస్ 5వ దశ ఈఈ వెంకట్‌రెడ్డి తెలిపారు.

తాలిపేరు కళకళ



తేగడ వద్ద నీట మునిగిన లోలెవల్ చప్టా

చర్ల: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్ట్‌కు వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టుకు చెందిన 25 గేట్లలో బుధవారం 9 గేట్లు ఎత్తి 8 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ ప్రవాహంతో తేగడ వద్ద ఉన్న తాలిపేరు లోలెవెల్ వంతెన నీటమునిగింది.

కుమ్మరిగూడెంలో గోదారి పరవళ్లు



కుమ్మరిగూడెంలో గోదావరి ప్రవాహం ఇలా..

అశ్వాపురం: మండల పరిధిలోని కుమ్మరిగూడెంలో ఉన్న దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద బుధవారం గోదావరి వరద పరవళ్లు తొక్కింది. ఎగువన ఉన్న శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ, తుపాకులగూడెం బ్యారేజీల గేట్లు ఎత్తడంతో ఇక్కడ గోదావరి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది.

క్లుప్తంగా

రామయ్య సన్నిధిలో బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారి



ఏపీ ఐఏఎస్ అధికారులతో ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి స్వామి వారి ఆలయాన్ని బుధవారం బీఎస్ఎన్ఎల్ తెలంగాణ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ చాగంటి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. అనంతరం ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏపీ ఐఏఎస్ అధికారులు..

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామి వారిని ఏపీ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఫైనాన్షియల్ అధికారి రావంత, ప్రిన్సిపల్ సెక్రెటరీ నటరాజ్ గుల్జర్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం భన్సన్, అభిషిక్త్ కిషోర్, ఐఎఫ్ఎస్ సునీల్ కుమార్ రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. అధికారులు వారికి ఆలయ మర్యాదలతో సత్కరించి స్వాగతం పలికారు.

ప్రాజెక్టు మరమ్మతు పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఈఈ రాంప్రసాద్

చర్ల: తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్టును బుధవారం ఈఈ రాంప్రసాద్ సందర్శించారు. సెన్సార్ పద్ధతిలో గేట్లు ఎత్తడం, దించడానికి సంబంధించి ఏర్పాటు చేస్తున్న పరికరాలను ఆయన డీఈ తిరుపతితో కలిసి పరిశీలించారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో ఉండాలని, సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. వారి వెంట ప్రాజెక్ట్ ఏఈలు, సిబ్బంది ఉన్నారు.

23న డిగ్రీ విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్ష

ఇల్లెందురూరల్: డిగ్రీలో ఒకే సబ్జెక్టులో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ నెల 23న ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ తెలి పారు. ప్రస్తుత విద్యాసంవత్సరం డిగ్రీ విద్యార్థులకు కాకతీయ యూనివర్సిటీ ఈ అవకాశాన్ని కల్పించిందని పేర్కొన్నారు. వరుసగా ఐదు సెమిస్టర్లు ఉత్తీర్ణులై ఆరో సెమిస్టర్‌లో ఒక్క సబ్జెక్టు మాత్రమే ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ అవకాశం వర్తిస్తుందని తెలిపారు. ఇందుకోసం విద్యార్థులు ఈ నెల 14వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యార్థులకు పాల్వంచ డిగ్రీ కళాశాలలో 23వ తేదీన మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వర కు పరీక్ష నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

సబ్ డివిజన్ కార్యాలయ ఏర్పాటుకు భవన పరిశీలన



పాత ఆర్డీఓ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఈఈ

పాల్వంచరూరల్ : పరిపాలన సౌలభ్యం కోసం పంచాయతీరాజ్ శాఖ పునర్ వ్యవస్థీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిన నేపథ్యంలో సబ్ డివిజన్ ఏర్పాటుకు అధికారులు బుధవారం పరిశీలన చేపట్టారు. ఈ మేరకు పాల్వంచ పాత ఆర్డీఓ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోలవరం భూసేకరణ కార్యాలయాన్ని ఈఈ శ్రీనివాసరావు, డీఈ సత్యనారాయణ తనిఖీ చేశారు. కొత్తగా మంజూరైన సబ్ డివిజన్ కార్యాలయాలను ఈనెల 9 నుంచి 12 లోగా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని బుధవారం ఉదయం స్థానికులు గుర్తించారు. అతడి వయసు సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుంది. బస్టాండ్ ప్రాంగణంలో రోజూ భిక్షాటన చేసే వ్యక్తిగా అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. మృతుడి బంధువులు, తెలిసిన వారు ఎవరైనా ఉంటే కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు, కొత్తగూడెం వన్‌టౌన్ పీఎస్ ఫోన్ నంబర్ 87126 82018లో సంప్రదించాలని సీఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

ముకుందా.. మురారీ!

నేడు కృష్ణాష్టమి పర్వదినం

- వేడుకలకు ముస్తాబైన ఆలయాలు
- ఉట్టి కొట్టేందుకు సిద్ధమైన భక్తులు



ఇల్లెందు మండలంలో నాయకులగూడెంలోని శ్రీకృష్ణుడి ఆలయం

ఇల్లెందురూరల్/కొత్తగూడెం టౌన్: దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ.. అన్న గీతోపదేశంతో మానవాళికి దిశానిర్దేశం చేశారు శ్రీకృష్ణభగవానుడు. మహాభారత యుద్ధాన్ని ముందుండి నడిపించిన మార్గదర్శి ఆయన. ద్వాపర యుగంలో జన్మించిన కృష్ణుడు నేటి కలియుగానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అందుకే ఆయనను అందరూ తమ ఇష్టదైవంగా కొలుస్తారు. నందగోపాలుడి జన్మదినం సందర్భంగా నిర్వహించుకునే కృష్ణాష్టమి ప్రతి ఒక్కరికి ప్రత్యేకమైన రోజు. ఈ పండుగను గురువారం జరుపుకోనుండగా ప్రతీ ఇంట్లో పిల్లలను బాలకృష్ణుడిలా అలంకరించి సంబురాలు జరుపుకోవడం అనాదిగా వస్తోంది.

శ్రీకృష్ణజన్మాష్టమి ప్రాముఖ్యత

శ్రీకృష్ణుడు శ్రావణమాసంలో వచ్చే బహుళ అష్టమి రోజు జన్మించాడు. ఆ రోజునే కృష్ణాష్టమిగా జరుపుకుంటారు. మిగిలిన పూజలన్నీ ఉదయమే ప్రారంభమైతే కృష్ణాష్టమి రోజు మాత్రం మధ్యాహ్నం సమయంలో ప్రారంభమవుతాయి. కృష్ణుడు అర్ధరాత్రి జన్మించినట్లు పురాణాలు చెబుతున్నందున కృష్ణాష్టమి పూజ కూడా రాత్రి సమయంలో చేసే ఆచారం కొనసాగుతోంది. కృష్ణాష్టమి రోజున ప్రజలంతా చిన్ని కృష్ణుడిని ఆరాధిస్తారు. పసిపిల్లలను కృష్ణుడి రూపంలో అలంకరించి మురిసిపోతారు. ఇక చిన్ని కృష్ణుడి విగ్రహానికి పంచామృతాలతో, గోరువెచ్చని నీటితో అభిషేకం చేసి నూతన వస్త్రాలు, ఆభరణాలతో అలంకరిస్తారు. కృష్ణుడికి మక్కువైన తులసీమాలను మెడలో వేసి పొన్న పూలతో పూజ చేయడం ఆనవాయితీ.

కృష్ణాష్టమి వ్రతం

శ్రావణమాసంలో వరలక్ష్మి వ్రతం, మంగళ గౌరీవ్రతం ఎక్కువగా చేస్తారు. వీటికి సమానమైన ప్రాధాన్యత కృష్ణాష్టమి వ్రతానికి ఉంది. అష్టమి తిథి రోహిణీ నక్షత్రం అర్ధరాత్రి సమయంలో ఉన్నప్పుడు మాత్రమే ఈ వ్రతాన్ని చేస్తారు. ఆ రోజు ప్రతీ తల్లి తనను తాను యశోదగా భావించుకుని.. పగలంతా ఉపవాసం ఉంటారు. కృష్ణుడు ఇంట్లోకి వస్తున్నట్లుగా పాదముద్రలు వేస్తారు. అర్ధరాత్రి వేళ కృష్ణుడు పుడతాడనే సమయం ఆసన్నమైనప్పుడు కాయం(బాలింతలకు పెట్టే కారం) పంచి పెడుతారు. కాల్చిన శొంఠితో దీన్ని తయారు చేస్తారు.

ఉట్టికొట్టే సంప్రదాయం

కృష్ణాష్టమి సందర్భంగా అంతటా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహిస్తారు. శ్రీకృష్ణుడికి ప్రీతిపాత్రమైన తెల్లటి వెన్న, పెరుగు, పాలను కుండలో ఉంచి దానికి తాడు కట్టి పెద్ద కర్రకు కడుతారు. దాన్ని ఎవరు చేరగలుగుతారనే పోటీలో అంతా ఉత్సాహంగా పాల్గొంటారు. కులమతాలకతీతంగా యువకులు పాల్గొని విజేతగా నిలిచి బహుమతి అందుకునేందుకు పోటీ పడతారు.

ముస్తాబైన ఆలయాలు

శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని ప్రత్యేక పూజల కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోకి శ్రీకృష్ణుని ఆలయాలు అందంగా ముస్తాబయ్యాయి. ఆలయాలకు రంగులు వేయించడంతో పాటు విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే, శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గురువారం పూజలకు హాజరయ్యే భక్తులకు ఇబ్బంది ఎదురుకాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కలియుగ దైవం శ్రీకృష్ణుడు



భక్తులు కోరిన కోరికలు తీర్చే శ్రీకృష్ణుడు. భక్తులందరికీ ఆరాధ్య దైవం. శ్రావణమాసంలో వచ్చే పండుగ కావడం మహిళలే కాక భక్తులందరూ కృష్ణాష్టమిని ఘనంగా జరుపుకుంటారు. రోజంతా ఉపవాసం ఉండి, అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు.

– గిరిధరాచార్యులు, అర్చకులు, రామవరం

విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న చక్రపాణి

మణుగూరురూరల్: విద్యార్థులు న్యూస్ పేపర్లు, మ్యాగజైన్లు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చక్రపాణి తెలిపారు. మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చక్రపాణి హాజరై మాట్లాడారు. సామాజిక మాధ్యమాలను సక్రమంగా ఉపయోగించుకోవాలని, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు గాజుల పూర్ణచందర్‌రావు, వ్యవస్థాపక అధ్యక్షులు పిల్లారిశెట్టి హరిబాబు, కళాశాల ప్రిన్సిపాల్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

అశ్వారావుపేటరూరల్: పారదర్శక ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బాధ్యులు తమవంతు సహకారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన రాజకీయ పార్టీల బాధ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు కోసం వచ్చిన దరఖాస్తుల్లో నకిలీలు ఉంటే గుర్తించి, తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు కృష్ణప్రసాద్, ముజాహిద్, ఎన్నికల డీటీ సుచిత్ర, వివిధ పార్టీల నాయకులు బండి పుల్లారావు, తుమ్మా రాంబాబు, గన్నిన రామకృష్ణ, ఎస్‌డీ రఫీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- ఏన్కూరు మండలం హిమామ్‌నగర్ వద్ద ఘటన
- మృతులిద్దరూ సుజాతనగర్ మండలవాసులు
- ఇరువురూ సమీప బంధువులే...



వంశీ (ఫైల్)



సాంబయ్య (ఫైల్)

ఏన్కూరు/సుజాతనగర్: ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల నుంచి అందిన సమాచారం ప్రకారం ... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం నాయకులగూడెం జీపీ పరిధి లెనిన్‌నగర్‌కు చెందిన ముడియం సాంబయ్య(28), వేపలగడ్డకు చెందిన పూనేం వంశీ(26) ఇద్దరు బావబామరుదులు. సుతారీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న వీరు ద్విచక్ర వాహనంపై ఏన్కూరులోని బంధువును కలిసేందుకు వచ్చారు. ఇక్కడి నుంచి తిరిగి వేపలగడ్డకు వెళ్తుండగా కొత్తగూడెం నుండి ఏన్కూరు వైపు వస్తున్న బొలేరో వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఇద్దరు సమీపంలోని పొలాల్లోని ఎగిరిపడగా తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో సాంబయ్యకు ఇంకా వివాహం కాలేదు. ఇక వంశీకి నాలుగేళ్ల క్రితం వివాహం జరగగా భార్య సరళతో పాటు మూడేళ్ల కుమార్తె, నాలుగు నెలల కుమారుడు ఉన్నారు. వీరిద్దరి మృతితో లెనిన్‌నగర్, వేపలగడ్డలో విషాదం నెలకొంది. కాగా, ఘటనాస్థలికి ఎస్‌ఐ బాదావత్ రవి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వాత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.



నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనం

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



పాల్వంచ: పశువులను అప్పగిస్తున్న దృశ్యం

భద్రాచలంటౌన్/పాల్వంచ: అక్రమంగా తరలిస్తున్న పశువులను భద్రాచలం పట్టణ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ పీవీఎన్ రావు.. నేతృత్వంలో ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా వ్యాన్‌లో ముగ్గురు వ్యక్తులు 16 పశువులను తరలిస్తూ పట్టుబడ్డారు. పోలీసులు వాహనాన్ని సీజ్ చేసి పశువులను తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేశారు. పశువులను పాల్వంచలోని అన్నపూర్ణ గోశాలకు తరలించారు. వాటిలో 12 దున్నపోతులు, నాలుగు గేదెలు ఉన్నాయని గోశాల నిర్వాహకులు ఆంజనేయశర్మ తెలిపారు.

సిరిపురం బ్యాంకులో గోల్‌మాల్

- రూ.10లక్షల మేర నగదులో తేడా

మధిర: మధిర మండలం సిరిపురంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్(ఏపీజీవీబీ)లో నగదు గోల్‌మాల్ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ బ్యాంకులో సుమారు రూ.10 లక్షలకు పైగా నగదు తేడా వచ్చినట్లుగా బ్యాంకు రీజియన్ అధికారులు గుర్తించారు. అయితే, బ్యాంకులో పనిచేస్తున్న అధికారులకు మాత్రం ఎలాంటి తేడా కనిపించలేదని సమాచారం. కానీ ఆన్‌లైన్‌లో తనిఖీ చేసినప్పుడు నగదు తేడా ఉన్నట్లు రీజియన్ అధికారులు గుర్తించి బ్యాంకులో పనిచేసి బదిలీపై వెళ్లిన క్యాషియర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇదే విషయమై సిరిపురం ఏపీజీవీబీ మేనేజర్ రవికుమార్ ఈనెల 1న మధిర రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారని రూరల్ ఎస్‌ఐ షేక్ రఫీ తెలిపారు. సాంకేతిక లోపం కారణంగా నగదు జమ కాలేదా లేక అవకతవకలు జరిగాయా అన్న కోణంలో రీజియన్ అధికారులు విచారణ చేస్తున్నారని బ్యాంకు మేనేజర్ రవికుమార్ వెల్లడించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ పెద్దన్నకుమార్

చుంచుపల్లి: చుంచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు బుధవారం సీఐ పెద్దన్నకుమార్ సమక్షంలో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రౌడీషీట్ కలిగిన వ్యక్తులు భూదందాలతో పాటు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. రౌడీషీటర్లపై పోలీసులు నిరంతర నిఘా ఉంటుందని, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఎవరైనా రౌడీషీటర్లు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టరీత్యా చర్యలు తీసుకొని పీడీ యాక్ట్ నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇనుప సెంట్రింగ్ ప్లేట్లు చోరీ

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామ సమీపంలో గల సీతారామ కెనాల్ పను లకు సంబంధించిన ఐరన్ సెంట్రింగ్ ప్లేట్లు చోరీకి గురయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. ఒడ్డుగూడెం గ్రామం సమీపంలో సీతారామ కెనాల్ పనులు చేపట్టే 8 ఐరన్ సెంట్రింగ్ ప్లేట్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. వాటి విలువ సుమారు రూ.32 వేలు ఉంటుందని సైట్ ఇంజనీర్ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ ఘటనపై బుధవారం ఎస్‌ఐ షాహీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోగొట్టుకున్న ఫోన్ రికవరీ



ఫోన్‌ను అందజేస్తున్న ఎస్‌ఐ గణేశ్

చర్ల: ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి పోలీసులు దానిని రికవరీ చేసి బుధవారం అందజేశారు. దుమ్ముగూడెం ఎస్‌ఐ గణేశ్ కథనం ప్రకారం.. భద్రాచలానికి చెందిన బందెల చంటి గత నెల 29న పర్ణశాల నుంచి భద్రాచలానికి వస్తున్న క్రమంలో ఫోన్ పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వెబ్‌సైట్‌లో ఫోన్‌కు సంబంధించిన వివరాలు నమోదు చేయగా.. మొబైల్‌ను పాల్వంచలో స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

స్వల్పంగా పెరుగుతున్న గోదావరి

భద్రాచలంటౌన్: ఎగువన కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి స్వల్పంగా పెరుగుతోంది. బుధవారం రాత్రి వరకు నీటిమట్టం 24 అడుగులకు చేరుకుంది. ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుండడంతో భద్రాచలం వద్ద ప్రవాహం మరికొంత పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

నలుగురిపై కేసు

పాల్వంచరూరల్: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఓ వివాహిత ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ కార్తీక్ కథనం ప్రకారం.. మండలంలోని దంతలబోరు ఎస్సీకాలనీకి చెందిన నక్క స్వాతి అదే గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌ను ప్రేమించి వివాహం చేసుకుంది. వివాహం జరిగినప్పుడు పసుపు, కుంకుమ కింద రూ.2 లక్షలు ఇచ్చారు. అనంతరం అత్తింటివారు అదనపుకట్నం తీసుకు రావాలని ఐదు నెలలుగా వేధిస్తున్నారని స్వాతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆమె భర్త అనిల్‌కుమార్, అత్త రోషమ్మ, మామ రామచంద్ర, మరిది మనోజ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సైబర్ కేసు నమోదు

ఇల్లెందురూరల్: మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయురాలు టెలీగ్రాం యాప్ ద్వారా ఉద్యోగానికి సంబంధించిన లింక్ క్లిక్ చేస్తున్న క్రమంలో మరో లింక్ క్లిక్ అవడంతో రూ.1.20 లక్షలు పాగొట్టుకుంది. దీంతో ఆమె బుధవారం సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: బాలిక అదృశ్యంపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. అదనపు ఎస్‌ఐ శివరామృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక ఉదయం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్‌ఐ తెలిపారు.

అపరిచితులు సంచరిస్తే సమాచారమివ్వండి..

ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి



గుండాల: నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న డీఎస్పీ రమణమూర్తి

గుండాల: ఆళ్లపల్లి మండలంలోని గొత్తికోయ గుంపుల్లో నివసించడానికి కొత్తవారొచ్చినా.. అపరిచితులు సంచరించినా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి సూచించారు. బుధవారం మండలంలోని రాయిపాడు గ్రామం గొత్తికోయ గుంపు వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు డీఎస్పీ పంపిణీ చేసి మాట్లాడారు. గత నెల కురిసిన ఎడతెరిపి లేని భారీ వర్షాలకు ఆళ్లపల్లి చరిత్రలో తొలిసారిగా కిన్నెరసాని నది ఉగ్రరూపం దాల్చడం, రాయిపాడు, ముత్తాపురం, అనంతోగు గ్రామాల్లోని ఇళ్లలోకి భారీగా వరదనీరు చేరడం బాధాకరమన్నారు. రాయిపాడు గ్రామంలోని నిరుపేద గొత్తికోయ గుంపు ప్రజల ఇళ్లు ఎక్కువగా కూలిపోయాయని తెలిపారు. పోలీస్ శాఖ తరఫున సాయం చేయాలనే దృక్పథంతో నిత్యావసరాలు అందించామని చెప్పారు. కార్యక్రమంలో టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, ఆళ్లపల్లి ఎస్‌ఐ ఈ.రతీశ్, సిబ్బంది కె.ఉపేందర్ పాల్గొన్నారు

మౌలిక వసతులు కల్పిస్తాం..

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమళ్ల జీపీ క్రాంతినగర్‌లోని గొత్తికోయలకు మౌలిక వసతులు కల్పిస్తామని డీఎస్పీ రెహమాన్ తెలిపారు. డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ పెద్దన్నకుమార్, ఎస్‌ఐలు సంతోష్, రాజమౌళి ఆ గ్రామానికి వెళ్లి గొత్తికోయలతో మాట్లాడారు. డీఎస్పీ మాట్లాడుతూ గొత్తికోయలకు పోలీసు శాఖ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని, పిల్లలు ఉన్నత చదువులు చదువుకునేందుకు పోలీసు శాఖ సహకరిస్తుందని హామీ ఇచ్చారు. కొత్త వారు వస్తే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు.

బీటీ రహదారులకు రూ.95.53 కోట్లు

- గిరిజనప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి మంజూరు
- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపిన ఎంపీ నామ

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.95,53,31,000 నిధులు మంజూరు చేసింది. ఈ విషయాన్ని ఎంపీ నామ నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నిధులతో గిరిజన గ్రామాల్లోని రహదారులకు మహర్దశ పట్టనుందని పేర్కొన్నారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దాదాపు అన్ని ఏజెన్సీ మండలాల్లో ఈనిధులతో రహదారులు నిర్మించనుండగా, ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని వైరా, కొణిజర్ల, ఏన్కూరు, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, కారేపల్లి, కామేపల్లి, జూలూరుపాడు, అశ్వారావుపేట, దమ్ముపేట, ములకలపల్లి, చంద్రుగొండ, చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం, వాజేడు, పాల్వంచ, కొత్తగూడెం, పినపాక, ఆళ్లపల్లి, మణుగూరు, అశ్వాపురం, కరకగూడెం, గుండాల, బూర్గంపాడు, బయ్యారం, గార్ల, టేకులపల్లి మండలాల్లోని గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మానానికి ఈ నిధులు విని యోగించనున్నట్లు చెప్పారు. గిరిజన, దళిత గ్రామాలకు కనీస సౌకర్యాల కల్పనకు సీఎం కేసీఆర్ పెద్ద పీట వేసిన నేపథ్యాన సీఎంతో పాటు మంత్రి కేటీఆర్‌కు ఎంపీ నామ నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్ల నిర్మాణం ఇలా..

జూలూరుపాడు మండలం అనంతారం–నల్లబండబోడు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4.50 కోట్లు, తవిసగుట్ట తండా – మాచినేనిపేట తండా హరిజనవాడకు రూ.కోటి, భోజ్యతండా–రాజరావుపేట రోడ్డు నిర్మాణానికి రూ.కోటి, కొణిజర్ల మండలం పిడబ్ల్యూ రోడ్డు నుంచి(వయా లాలాపురం) శాంతినగర్ ఎస్టీ కాలనీ వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.4.10 కోట్లు మంజూరయ్యాయి. అలాగే, ఏన్కూరు మండలం హిమాంనగర్–భద్రు తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు, కారేపల్లి మండలం రాయగూడెం–రూక్కీ తండాకు రూ.80 లక్షలు, కామేపల్లి మండలం రూక్కీతండాకు రూ.80 లక్షలు, సింగరేణిలో రోడ్డుకు రూ.80 లక్షలు, కారేపల్లిలో నిర్మించే రోడ్డుకు రూ.2 కోట్లు, తిరుమలాయపాలెం మండలం చంద్రు తండా ఆర్ అండ్ బీ రోడ్డు – జాతీయ రహదారి 365 వరకు నిర్మించే రహదారికి రూ.80 లక్షలు కేటాయించారు. ఇంకా ఆర్‌అండ్ బి రోడ్డు – రవిశెట్ల తండా – హైదర్ సాయిపేట రోడ్డుకు రూ.2.40 కోట్లు నిధులు మంజూరయ్యాయని నామ నాగేశ్వరరావు తెలిపారు. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పాత మారేడుబాక రోడ్డుకు రూ.80 లక్షలు, చర్ల మండలం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి జాతీయ రహదారి 365 వరకు నిర్మించే రోడ్డుకు రూ.1.20 కోట్లు మంజూరు చేసినట్లు ఎంపీ వెల్లడించారు.

సింగరేణి ఎన్నికలపై ఈనెల 11న భేటీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల అంశంపై చర్చించేందుకు ఈ నెల 11న హైదరాబాద్‌లోని డీవైసీఎల్సీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. సింగరేణి ఎన్నికలను అక్టోబర్ నెలకు వాయిదా వేయాలని మే 23న హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అక్టోబర్‌లో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు గాను చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. సింగరేణి అధికారులతో పాటు వివిధ ట్రేడ్ యూనియన్ల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు హాజరు కావాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ సెంట్రల్ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాసులు బుధవారం లేఖలు పంపించారు.

అక్టోబర్‌లో ఎన్నికలు నిర్వహించాల్సిందే..

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలను అక్టోబర్‌లో నిర్వహించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని ఏఐటీయూసీ కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శి వి.మల్లికార్జున్‌రావు తెలిపారు. కొత్తగూడెంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. మే నెలలోనే ఎన్నికలు జరగాల్సి ఉన్నా, ఉత్పత్తికి విఘాతం ఏర్పడుతుందని సంస్థ కోరడంతో సమయం ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ మేరకు అక్టోబర్‌లో ఎన్నికలు నిర్వహించకపోతే సమ్మె అనివార్యమవుతుందని హెచ్చరించారు. నాయకులు జి.వీరస్వామి, ఎస్‌వీ రమణమూర్తి, సోమయ్య పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయినిగా సుజాత



అవార్డు స్వీకరిస్తున్న సుజాత

భద్రాచలంటౌన్: భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాలల టీజీటీ బి.సుజాతకు ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు లభించింది. తెలుగులో వంద శాతం ఫలితాలు రావడంతో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు అవార్డుకు ఎంపిక చేశారు. బుధవారం హైదరాబాద్‌లో సుజాత అవార్డు స్వీకరించగా ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్, ప్రిన్సిపాల్ దేవదాసు అభినందనలు తెలిపారు.